RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

WANTED REPORTERS IN TELANGANA
NAVATARAM TELUGU DAILY

హైదరాబాద్ | గురువారం | సంపుటి: 9 | సంచిక: 247 | పేజీలు: 04 | వెల: 5 /- | 24 సెప్టెంబర్ 2026

# హామీలు అమలు చేయండి

- **హామీలు అమలు లేకపోతే ఉద్యమం తప్పదు**
- **టీయూడబ్ల్యూజే (H-143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్**

**వికారాబాద్, నవతరం:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం వికారాబాద్ జిల్లా నుంచే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ H-143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణంలోని శివకేశవ కాన్వెంట్ హాల్‌లో TUWJ–H-143 వికారాబాద్ జిల్లా మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మారుతి సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై TUWJ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తే జర్నలిస్టుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా మహాసభ నుంచే ప్రభుత్వంపై పోరాటానికి శంఖారావం పూరిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ కార్యరూపంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, భద్రత కోసం TUWJ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ నెల 27న నిర్వహించనున్న TUWJ–H-143 వికారాబాద్ జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మారుతి సాగర్ పిలుపునిచ్చారు. మహాసభను జర్నలిస్టుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణకు కీలక వేదికగా మలచాలని కోరారు. ఈ కార్యక్రమంలో TUWJ రాష్ట్ర కోశాధికారి యోగానంద, జాతీయ కౌన్సిల్ సభ్యులు తిరుపతి నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ ఆసిఫ్ హుస్సేన్, వికారాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవీందర్, జిల్లా నాయకులు ప్రహ్లాదచారి, జి. నర్సింహులు, శ్రీనివాస్, ఆనంద్, మల్కయ్య, రాజు, జావేద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల TUWJ అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**హైదరాబాద్, నవతరం:** జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మంగళవారం నాంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, ఆ సంస్థలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు మరియు విద్యా కార్యకలాపాలను తనిఖీ చేశారు. తన పర్యటన సందర్భంగా, కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి, అభ్యాస అనుభవం మరియు వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, క్రమశిక్షణ పాటించాలని, వారి కెరీర్ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ఆమె సూచించారు. లెక్టర్ బోధనా సిబ్బందితో కూడా మాట్లాడి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రదర్శన మరియు బోధనా పద్ధతులను సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైన వారికి అదనపు సహాయం అందించాలని ఆమె అధ్యాపకులను ఆదేశించారు. డాక్టర్ ప్రియాంక ఆలా కళాశాల ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్యం మరియు ఇతర సౌకర్యాలతో సహా ప్రాథమిక మౌలిక సదుపాయాలు మరియు సౌకర్యాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన మరియు అనుకూలమైన అభ్యాస వాతావరణం కల్పించేలా చూడాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థలలో విద్యా నాణ్యతను బలోపేతం చేయవలసిన ఆవశ్యకతను కలెక్టర్ నొక్కిచెప్పారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు, బోధనా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.





# ‘ఖేలో తెలంగాణ’ నిరంతర క్రీడా ఉద్యమానికి శ్రీకారం...



**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో క్రీడా సంస్కృతిని మరింత విస్తృతం చేయడంతో పాటు, శారీరక చైతన్యాన్ని ప్రజల దైనందిన జీవితంలో భాగం చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో “ఖేలో తెలంగాణ” పేరుతో నిరంతర కార్యక్రమాలు రూపొందిస్తుంది. ఈ మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారి చేతుల మీదుగాఖేలో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సచివాలయంలో జరిగినఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జేయేసి రంజన్ స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి మరియు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు. నిరంతర ప్రక్రియ లాగా సాగే ఖేలో తెలంగాణ కార్యక్రమం లో భాగంగా “ఖేలో తెలంగాణ బంధన్” ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం 30 నిమిషాలు కేటాయించేలా ప్రజలను ప్రోత్సహించనున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమకు అనువైన శారీరక వ్యాయామాన్ని అలవాటుగా మార్చుకునేలా ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దనున్నారు.

### 9+9+9 ఫిట్‌నెస్ ఛాలెంజ్

“ఖేలో తెలంగాణ బంధన్”లో భాగంగా 9+9+9 ఫిట్‌నెస్ ఛాలెంజ్ ను నిర్వహించనున్నారు. వాకింగ్, జాగింగ్, యోగా తదితర కార్యకలాపాల్లో పాల్గొంటూ, వాటికి సంబంధించిన27 సెకండ్ల వీడియోను తమ సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేసి, 9 మంది తమ మిత్రులను ట్యాగ్ చేస్తూ,మరో 9 మందిని ఈ ఛాలెంజ్‌కు ఆహ్వానించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి ఈ ఫిట్‌నెస్ సందేశం విస్తరించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

### లీగ్‌ల ద్వారా క్రీడా సంస్కృతికి ప్రోత్సాహం

“ఖేలో తెలంగాణ”ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర క్రీడా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లేలా వివిధ క్రీడాంశాల్లో లీగ్ పోటీలను ప్రోత్సహించనున్నారు. పాఠశాల స్థాయి నుంచి అన్ని వయస్సుల వారికి క్రీడల్లో పాల్గొనే అవకాశాలను పెంచుతూ, వివిధ క్రీడాంశాలపై అవగాహన, ఆసక్తి మరియు ప్రేక్షకాదరణను విస్తరించడమే ఈ లీగ్‌ల ప్రధాన ఉద్దేశం. రెజ్లింగ్,బాక్సింగ్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ జూడో బాస్కెట్బాల్అథ్లెటిక్స్ ఫుట్ బాల్ సైక్లింగ్ యోగాసన తోపాటు మరికొన్ని క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ భావిస్తుంది.






### ఒక నిరంతర కార్యక్రమంలా...

“ఖేలో తెలంగాణ” ద్వారా ఫిట్‌నెస్‌ను ప్రజల జీవనశైలిలో భాగం చేయడం, క్రీడలను ప్రజలందరికీ చేరువ చేయడం, క్రీడా ప్రతిభకు వేదికలు కల్పించడం, తెలంగాణలో బలమైన క్రీడా సంస్కృతిని నిర్మించడం లక్ష్యంగా దశలవారీగా నిరంతరంకార్యక్రమాలు జరిగేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్రీడాభిమానులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత, విద్యాసంస్థలు, క్రీడా సంఘాలు, ఫిట్‌నెస్ ప్రేమికులు, యావత్తు తెలంగాణ క్రీడా సమాజం భాగస్వాములు కావాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా సలహాదారులు జితేందర్ రెడ్డి క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ జయష్ రంజన్ స్పోర్ట్స్ ఎండి సోనీ బాలాదేవిలు విజ్ఞప్తి చేశారు.

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం

- రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ
- ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, నవతరం:** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి, అగ్నిప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును పరిశీలించారు. ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత వైద్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం, తీసుకున్న తక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సోమవారం రాత్రి సుమారు 11.40 గంటల సమయంలో రిమ్స్‌లోని నవజాత శిశు వార్డులో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ఏసీకి సంబంధించిన ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి, చికిత్స పొందుతున్న నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రభావిత చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకున్నట్లు వెల్లడించారు.

రిమ్స్‌లో మాతా, శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల ప్రసూతి సేవలు, తల్లుల సంరక్షణ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రస్తుతం రిమ్స్‌లో సుమారు 800 పడకలు ఉన్నాయని, అదనంగా 150 పడకల ఎం సి ఎచ్ భవనం ఏర్పాటు చేయడం ద్వారా రిమ్స్‌ను సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో పలు కొత్త విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. థలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫీలియా వంటి వ్యాధులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెమటాలజీ విభాగం, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రిమ్స్‌లో పీజీ వైద్య విద్యార్థుల సంఖ్య, ఓపీ, ఐపీ సేవలను పెంచడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ తదితర విభాగాల్లో పీజీ సీట్ల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా లోపాలు, నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. రిమ్స్‌లో కింది మూడు కీలక సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్ నిపుణుల కమిటీ నివేదిక, సేఫ్టీ ఆడిట్‌ల ఆధారంగా రిమ్స్‌లో అవసరమైన మరమ్మతులు, అదనపు మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణం, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రి తెలిపారు.

రిమ్స్‌లో మెయింటెనెన్స్, మానిటరింగ్, భద్రతా ప్రమాణాల అమలులో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తామని చెప్పారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడినా, నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిమ్స్‌లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన మానవ వనరులను సమకూర్చడం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆస్పత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నారా లోకేశ్ రాజీనామా చేయాలి

**అమరావతి, నవతరం:** డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.



తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## జూరాలకు నీటి విడుదలకు ఓకే

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు.

తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్

- **ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత**
- **ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు**
- **నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక**

**హైదరాబాద్, నవతరం:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.



## హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్

**హైదరాబాద్, నవతరం:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

# దొంగతనం కేసును ఛేదించిన సిద్దిపేట పోలీసులు

**సిద్దిపేట, నవతరం:** చిన్నకోడూరు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ & సాంకేతిక దర్యాప్తు ఆధారంగా దొంగతనం కేసును ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలు, 4 మొబైల్ ఫోన్లు మరియు నేరానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.






# ఆకాశం నుంచి పూలవర్షం
## భక్తిశ్రద్ధలతో గణనాథుడి వీడ్కోలు..

**బౌరంపేట / కుత్బుల్లాపూర్, నవతరం:** నవరాత్రులు భక్తులతో పూజలందుకున్న గణనాథుడికి దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ లో అగ్లీ బార్ జల్దీ ఆనా అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. 'హనుమాన్ యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో భౌరంపేట్ బొడ్రాయి వద్ద నిర్వహించిన గణనాథుడికి ఘన వీడ్కోలు కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజ లు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సరుగారి ధర్మారెడ్డి స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, బౌరంపేట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.





# వీధి దీపాల సమస్యను పరిష్కరించండి

- నిరసన కార్యక్రమానికి హాజరైన వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్పల్లి, నవతరం:** కైలాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వీధి దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైతాలాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లోని అనేక కాలనీలలో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గణేష్ నిమర్జన కార్యక్రమాల సందర్భంగా వెలుతురు లేక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని రాజేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా చీకటిని ఆసరాగా చేసుకుని ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు అవకాశం ఏర్పడుతోందని, మాదకద్రవ్యాలు సేవించి తిరిగే వ్యక్తుల కారణంగా రాత్రివేళల్లో విధులు ముగించుకుని వెళ్లే మహిళలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యలపై ప్రజలు ఇప్పటికే పలుమార్లు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంతో నిరసన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు అధికారులకు వినతిపత్రం అందజేసి, ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమానికి స్పందించిన సంబంధిత అధికారులు వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు, వీధి దీపాల మరమ్మతులు మరియు అవసరమైన పనులను తక్షణమే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖైతాలపూర్ డివిజన్ నాయకులు ఐలయ్య యాదవ్, కోడిచెర్ల వినోద్, శేఖర్ గుప్తా, పండుగ రేణుక, జీవన్, ఈ.సాయి ప్రసాద్, శ్రీనివాస్ చారి, శివా చారి, వంశీ నేత, నాని,సితారం,అనిత, కృష్ణ, కిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.








**బుధవారం నాడు సాయంత్రం కూకట్పల్లి నియోజకవర్గంలో పలు వినాయక మండపాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.** - నవతరం, కూకట్పల్లి

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్పల్లి, నవతరం:** గణేష్ నవరాత్రుల సందర్భంగా మూసాపేట్ ఆంజనేయ నగర్, వివేక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, న్యూ బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, బాలాజీ నగర్‌లోని సంజీవిని దేవాలయం, వసంత నగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి దివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ మండపాల వద్దకు విచ్చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావుకు మండప నిర్వాహకులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే పవిత్రమైన వేడుకలని అన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మండప నిర్వాహకులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.








# గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా.. సురక్షితంగా జరగాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 22 (నవతరం):** గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఆదేశించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పోలీస్‌స్టేషన్ల వారీగా నిమజ్జనాల పరిస్థితి, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.

**నిమజ్జనాల పరిస్థితిపై ఆరా..**

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎన్ని గణేశ్ విగ్రహాలు నిమజ్జనం పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం కావాల్సి ఉందనే వివరాలను సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలు, గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. నిమజ్జన మార్గాల్లో ఎక్కడైనా ట్రాఫిక్ రద్దీ, వాహనాల పార్కింగ్ సమస్యలు, మార్గాల విషయంలో ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితిని అధికారులతో చర్చించారు.

**రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు**

నిమజ్జన మార్గాల్లో రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. ప్రధాన కూడళ్లు, నిమజ్జన కేంద్రాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, ట్రాఫిక్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. నిమజ్జన మార్గాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట సిబ్బందిని వెంటనే మోహరించాలని సూచించారు.

**అన్ని శాఖలతో సమన్వయం**

పోలీసులు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయం కీలకమని సీపీ పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో చిన్న సమస్య కూడా పెద్ద ఇబ్బందిగా మారకుండా అధికారులు ముందుగానే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, నిమజ్జనాలు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

**మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం**

నిమజ్జన ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సీపీ స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటలు జరగకుండా బారికేడ్లు, పోలీసు సిబ్బంది మోహరింపు తదితర చర్యలను సమర్థంగా అమలు చేయాలని చెప్పారు. "గణేశ్ నిమజ్జనాలు భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి. నిమజ్జన మార్గాల్లో రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి" అని సీపీ డా. ఎం. రమేశ్ తెలిపారు.

**బందోబస్తుకు 465 మంది అదనపు సిబ్బంది**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అదనపు పోలీసు బలగాలను రప్పించారు. ఇతర జిల్లాలు, పోలీసు యూనిట్ల నుంచి రెండు దశల్లో మొత్తం 465 మంది అదనపు సిబ్బందిని బందోబస్తుకు వినియోగిస్తున్నారు. తొలి దశలో 189 మంది, రెండో దశలో 276 మంది సిబ్బంది సైబరాబాద్‌కు చేరుకున్నారు. ఈ అదనపు బలగాల్లో 5 మంది ఏసీపీలు, 6 మంది సీఐలు/రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 18 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 99 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, సుమారు 250 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా కానిస్టేబుళ్లు, 74 మంది హోంగార్డులు ఉన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు టీజీపీఏ, పీటీసీ వరంగల్, మల్టీ-జోన్-2 నుంచి ఈ అదనపు బలగాలను రప్పించారు.

**నిమజ్జన మార్గాలు, కేంద్రాల్లో మోహరింపు**

అదనపు పోలీసు బలగాలను నిమజ్జన మార్గాలు, నిమజ్జన కేంద్రాలు, ప్రధాన కూడళ్ల వద్ద మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు వీరిని వినియోగిస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల భద్రతపై నిరంతర నిఘా కొనసాగించనున్నారు.

**పోలీసులకు ప్రజలు సహకరించాలి**

నిమజ్జనానికి వెళ్లే భక్తులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సీపీ కోరారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని పోలీసు సిబ్బందిని సంప్రదించాలని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేందుకు పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు సమన్వయం, అప్రమత్తత, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సీపీ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో సీఎంసీ కమిషనర్ సృజన, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాసరావు, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# హైడ్రాలో ఘనంగా గణపతి పూజలు

## సందడిగా నిమజ్జన కార్యక్రమం

**హైదరాబాద్, నవతరం:** హైడ్రాలో గణేష్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విగ్రహాన్ని ప్రతిష్టించిన నాటి నుంచి నిమజ్జనం వరకు ప్రత్యేక పూజలు సాగాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు గణేష్ ఉత్సవాలు దోహదం చేయాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం గణపతి నిమజ్జన యాత్ర శోభాయమానంగా జరిగింది. హైడ్రా సిబ్బంది నృత్యాల మధ్య ట్యాంక్‌బండ్‌కు తరలించి గణేష్ నిమజ్జనాన్ని పూర్తి చేశారు.






# కేపీహెచ్బీ నుండి వేవ్రాక్ వరకు ప్రత్యేక బస్సు లేన్ల ఏర్పాటు

- సాధ్యాసాధ్యాల పరిశీలనకు ట్రయల్ రన్ నిర్వహణ

**హైదరాబాద్, నవతరం:** రవాణా శాఖ మరియు TGSRTCతో గతంలో జరిగిన చర్చల కొనసాగింపుగా, రద్దీ సమయాల్లో బస్సుల వేగవంతమైన రాకపోకలకు మరియు ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి వీలుగా KPHB నుండి Waverock వరకు TGSRTC మరియు IT కంపెనీ బస్సుల కోసం ప్రత్యేక లేన్‌ను ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఒక ట్రయల్ రన్ నిర్వహించబడింది. బస్సులు వేగంగా ప్రయాణించేలా తక్కువ స్టాప్‌లతో కూడిన ఈ ప్రత్యేక బస్సు సదుపాయం యొక్క ఆచరణీయతను, అలాగే ట్రాఫిక్ ప్రవాహం మరియు రోడ్డు సామర్థ్యాన్ని అంచనా వేయడానికి రోడ్డు మరియు నగర ప్రణాళికా నిపుణులతో కలిసి ఈ ట్రయల్ రన్ చేపట్టారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో JNTU–Biodiversity కారిడార్‌లో ట్రాఫిక్ కదలికలు మరియు రద్దీని తగ్గించే చర్యల సాధ్యాసాధ్యాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ ట్రయల్ రన్ సమయంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ (IPS), సైబరాబాద్ ట్రాఫిక్-II DCP శేషాద్రిని రెడ్డి (IPS), TGSRTC ED శ్రీధర్, SCSC CEO నవేద్ ఆలం ఖాన్ తదితర అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# 'గణేష్ పూజ'లో పాల్గొన్న గంటా శివారెడ్డి



**కుత్బుల్లాపూర్, నవతరం:** గణేష్ నవరాత్రుల సందర్భంగా.. మల్లారెడ్డి నగర్ ఫేస్ వన్ రోడ్ నంబర్ 8 లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు గంటా శివారెడ్డి. ఈ సందర్భంగా ఆయన ఏకదంతుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రజల మధ్యలో ఉండే గంటా శివారెడ్డి గణేష్ నవరాత్రులు మొదలైన నుండి గాజులరామారం పరిధిలోని అనేక పూజల్లో పాల్గొన్నారు. బుధవారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ప్రజల క్షేమం, సంతోషం కోరుకున్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com